క్లుప్తంగా

విద్యార్థినులకు కలెక్టర్ అభినందన



అభినందిస్తున్న కలెక్టర్ యాస్మిన్ భాషా

కోరుట్ల: పట్టణంలోని మాస్ట్రో జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థులు చిలివేరి రశ్మిత,ఆడెపు దీప్తిలను జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా శుక్రవారం అభినందించారు. చిలివేరి రశ్మిత ఎంపీసీ సెకండియర్‌లో 992 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించగా, ఆడెపు దీప్తి నందన సీఈసీ సెకండియర్‌లో 983 మార్కులతో జిల్లా ఫస్ట్ ర్యాంక్ పొందింది. ఇద్దరు విద్యార్థినులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్ నోడల్ అధికారి బి. నారాయణ, కళాశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాళ్లకు అడిషనల్ కలెక్టర్ సన్మానం



పిన్సిపాల్‌ను సన్మానిస్తున్న అడిషనల్ కలెక్టర్

ధర్మపురి: పదోతరగతి ఫలితాల్లో ధర్మపురి మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో వంద శాతం పాస్ అయిన ఏకైక పాఠశాల మైనార్టీ గురుకుల పాఠశాలగా గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగసుధను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ బి.ఎస్‌లత సన్మానించారు. అలాగే ఇంటర్ మైనార్టీ గురుకుల కళాశాలకు చెందిన అక్షిత రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు, రుక్సానా నాలుగో ర్యాంకు సాధించడంతో కళాశాల ప్రిన్సిపాల్ సంజితా భానును సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులున్నారు.

ఉన్నత చదువులు చదివి లక్ష్యాన్ని సాధించాలి



టాపర్లను సన్మానిస్తున్న ఎంపీపీ

ఇబ్రహీంపట్నం: ఉన్నత చదువులు చదివి లక్ష్యాన్ని సాధించాలని ఎంపీపీ జాజాల బీమేశ్వరి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పదో తరగతి టాపర్లను సన్మానించారు. మోడల్‌స్కూల్‌కు చెందిన మండలటాపర్ శ్రీ వైష్ణవి 9.7, నేరేళ్ళ మనుశ్రీ 9.5 ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్‌బాబు, నాయకులు జగన్‌రావు, తుక్కరం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

కథలాపూర్: మండలంలోని అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎస్సెస్సీ మండల టాపర్ విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో సన్మానించారు. పాఠశాలకు చెందిన కె. సంగీత, ఏ.లాస్విక, ఏ.అంజన అనే విద్యార్థులు మండలస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానం దక్కించుకున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. వీరిని పూర్వ విద్యార్థుల బృందం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపు శ్రీనివాస్, ఎంపీటీసీ గంగరాజం, హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

సీబీఎస్సీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల: సీబీఎస్సీ ఫలితాల్లో జగిత్యాలలోని శ్రీచైతన్య, కేజీఆర్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. కురిక్యాల ప్రణయ్ 463/500, గౌరై శరణ్య 461 మార్కులు సాధించారు. కరస్పాండెంట్ గంగారెడ్డి, డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

మంత్రిని కలిసిన నందిపల్లి గ్రామస్తులు



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

గొల్లపల్లి: మండలంలోని నందిపల్లిలో చౌడమ్మ ఆలయ అభివృద్ధి కోసం గ్రామస్తులు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కరీంగనర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. దీంతో అభివృద్ధి కృషి చేస్తానని మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జలేందర్, సర్పంచ్ శంకర్, యాదవ అధ్యక్షుడు అత్తిని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల్లో సౌకర్యాలు కరువు

- నీళ్లు లేవు.. కరెంట్ లేదు
- పడుతూ.. లేస్తూ అంతిమయాత్రలో పాల్గొంటున్న ప్రజలు
- ఇబ్బందుల్లో మృతుల బంధువులు



బొమ్మెనలో వాగులో కలిసిపోయిన శ్మశానవాటిక



ఆనవాళ్లు కోల్పోయిన దహనవాటికలు

కథలాపూర్: మనిషి బతికినన్నీ రోజులు ఏదో ఒక ఒత్తిడి.. బాధలు తప్పవు. కానీ ఆ మనిషి చనిపోయిన తర్వాత కూడా ఆ మనసుకు ప్రశాంతతలేని పరిస్థితి నెలకొంది. పార్థివదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశానవాటికలు నిర్మించినప్పటికీ మౌళిక వసతులు కరువయ్యాయి. పలు గ్రామాల్లోని శ్మశానవాటికల వద్ద ప్రధానంగా నీళ్ల, కరెంట్ లేక అక్కడికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి అభివృద్ధిపనులకు నిధులు మంజూరైనప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు శ్మశానవాటికల్లో ఏళ్లతరబడిగా మౌళిక వసతులు కల్పించకపోవడం దారుణమని ప్రజలు మండిపడుతున్నారు.

19 గ్రామాల్లో శ్మశావాటికల నిర్మాణం

అంత్యక్రియల సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రతీ గ్రామానికో వైకుంఠధామం నిర్మించాలని ప్రభుత్వం ఉపాధిహామీ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులు 2017 మేలో మంజూరు కాగా పనులకు అప్పట్లో భూమిపూజ చేశారు. కథలాపూర్ మండలంలోని 19 గ్రామాలకు గాను ప్రతీ గ్రామానికి ఒక్కో శ్మశానవాటిక మంజూరైంది. 17 గ్రామాల్లో అప్పట్లోనే పనులు ప్రారంభించి పూర్తిచేయగా.. తక్కళ్లపెల్లి, రాజారాం తండా గ్రామాల్లో పనులు ప్రారంభించలేదు. రెండేళ్ల క్రితం పనులు చేపట్టడంతో ఈ రెండు గ్రామాల్లో శ్మశానవాటికలకు రూ. 12 లక్షల చొప్పున కెటాయించారు. 19 గ్రామాలకు నిధులు రూ. 1.94 కోట్లు వెచ్చించారు.

నీళ్ల, కరెంట్ లేక ఇబ్బందులు

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా.. వైకుంఠధామాల నిర్మాణాలు స్థానిక ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో చేయించారు. ప్రభుత్వ స్థలం ఎక్కడ ఉంటే అక్కడే అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్మించేందుకు మొగ్గుచూపారు. బొమ్మెనలో వాగు ఒడ్డుకు నిర్మించడంతో గతేడాది కురిసిన వర్షాలకు శ్మశానవాటికలో పలు నిర్మాణాలు కొట్టుకుపోయాయి. రోడ్డు సౌకర్యం లేదని గ్రామస్తులు తెలిపారు. చింతకుంట, దుంపేట, ఊట్‌పెల్లి గ్రామాల్లో నీటి సౌకర్యం లేక అంత్యక్రియలు పూర్తయ్యాక పంటపొలాల వద్దకు వెళ్లి స్నానం చేస్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. ఎక్కువ గ్రామాల్లో శ్మశానవాటికల వద్ద ఇప్పటికి విద్యుత్ సౌకర్యం లేకపోవడం బాధాకరమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్మశానవాటికలకు విద్యుత్, నీటి సౌకర్యం కల్పించడం గ్రామపంచాయతీల బాధ్యత అని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇదీ పంచాయతీలపై అదనపు భారం పడుతోందని సర్పంచులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించి శ్మశానవాటికల వద్ద నీటి, విద్యుత్, రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యం లేక తిప్పలు



బొమ్మెనలో శ్మశానవాటిక వద్దకు మృతదేహాన్ని తీసుకెళ్లేటప్పుడు రోడ్డు సరిగా లేక మృతుల బంధువులు, గ్రామస్తులు ఇబ్బందిపడుతున్నారు. గతేడాది కురిసిన వర్షాలకు శ్మశానవాటిక వాగులో కలిసినట్టుగా ఉండడంతో అక్కడికి వెళ్లడం కష్టంగా ఉంది. అధికారులు చొరవ చూపి శ్మశానవాటిక వరకూ రోడ్డు నిర్మించాలి. కనీస వసతులు కల్పించాలి. – కొడిమ్యాల భూమాగౌడ్, బొమ్మెన

పవర్ కనెక్షన్ ఇస్తలేరు

శ్మశానవాటికకు ఇప్పటికీ విద్యుత్ కనెక్షన్ లేదు. రాత్రివేళల్లో అంత్యక్రియలు నిర్వహించాలంటే ప్రజలు చీకట్లో ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ట్రాన్స్‌కో అధికారులను కోరితే జీపీ నుంచి రూ.1.40 లక్షల చలాన్‌కట్టాలంటున్నారు. చిన్న గ్రామపంచాయతీల నుంచి అన్ని నిధులు చెల్లించాలంటే కష్టమే. ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టిసారించి శ్మశానవాటికలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి. – గజ్జెల స్వామి, సర్పంచ్, ఊట్‌పెల్లి

గ్రామపంచాయతీలే వసతులు కల్పించాలి



శ్మశానవాటికలల వద్ద విద్యుత్, నీటి సౌకర్యాలు జీపీలే కల్పించాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ట్రాన్స్‌కో అధికారుల ప్రతిపాదనలతో జీపీలు డీడీలు చెల్లిస్తే విద్యుత్ కనెక్షన్ ఇస్తారు. మిషన్ భగీరథ పథకంలో నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశాలున్నాయి. శ్మశానవాటికలకు జీపీలే వసతులు కల్పించాలి. – జనార్దన్, ఎంపీడీవో, కథలాపూర్

స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న చైర్మన్

రాయికల్: పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో మురికికాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, చెత్త తొలగించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు మాట్లాడుతూ, స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సంతోష్‌కుమార్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

అనుమతి పొందిన తర్వాతే నిర్మాణాలు చేపట్టాలి

పట్టణంలో టీఎస్ బీపాస్ ద్వారా అనుమతి పొందిన తర్వాతే నిర్మాణాలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ సూచించారు. శుక్రవారం 9, 11 వార్డుల్లో సెట్‌బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణ యజమానులకు, రోడ్డుపై మురికికాలువలు మూసివేసి నిర్మిస్తున్న యజమానులకు నోటీసులు అందజేశారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో మొదటి రోజు పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడిసె శ్రీమతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



జీపీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రాయికల్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. రాయికల్ మండలం సింగరావుపేటలో రూ.20 లక్షల వ్యయంతో నూతన గ్రామపంచాయతీ భవనానికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శుక్రవారం భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, మురికికాలువల నిర్మాణానికి, తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంచందర్ రావు, ఉపసర్పంచ్ బీమయ్య, సింగిల్ విండో చైర్మన్ రాజలింగం, కో–ఆప్షన్ మెంబర్ మొఖిద్, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి బోనాల జాతరలో ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: మండలంలోని అంతర్గాంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దమ్మతల్లి బోనాల జాతర నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని డప్పుల చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి పెద్దమ్మతల్లి ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల రైతుబంధు కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, సర్పంచ్ బోనగిరి నారాయణ, ఉపసర్పంచ్ శేఖర్‌రెడ్డి, చిన్నవేని సురేశ్ పాల్గొన్నారు.

రజకుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

జగిత్యాల: రజకుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పలు పార్టీలకు చెందిన రజక సంఘం నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పట్టణ రజక సంఘం అధ్యక్షుడు పెద్దింటి రాజు, రాజేశం, రాజేశ్, నారాయణ, కప్పల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పరస్పర సహకారంతో మరింత అభివృద్ధి

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్
విగ్రహ ప్రతిష్ఠలో హంపి పీఠాధిపతి

కథలాపూర్: ప్రభుత్వం, ప్రజల పరస్పర సహకారంతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలం భూషణరావుపేటలో కొత్తగా నిర్మించిన శ్రీ రేణుకాఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ పూజ కార్యక్రమాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. సీజీఎఫ్ నిధులు రూ. 50 లక్షలు రేణుకాఎల్లమ్మ ఆలయం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, ఏఎంసీ చైర్‌పర్సన్ సౌజన్య, గడ్డం భూమరెడ్డి, గంద్ర కిరణ్‌రావు, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు. భూషణరావుపేటలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ రేణుకాఎల్లమ్మ ఆలయంలో విగ్రహాలను శుక్రవారం ఉదయం హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి చేతులమీదుగా ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం ఎల్లమ్మ దేవత కల్యాణం జరిపించారు. అన్నదానం చేశారు.

సంక్షిప్త వార్తలు

గోదావరిలో భక్తులకు సౌకర్యాలు

ధర్మపురి : హన్మాన్ పెద్ద జయంతి సందర్భంగా వచ్చే భక్తులకు వసతులు కల్పించారు. ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి దేవస్థానం వారి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా వచ్చే భక్తులు మొదట గోదావరిలో స్నానాలు ఆచరిస్తారు. వేసవి ఎండలు అధికంగా ఉన్నందున స్నానాలకు వచ్చే భక్తులకు గోదావరిలో నీడ వసతులు, తాగునీటి వసతి కల్పిస్తున్నారు.

విచారణ జరపకుండా సస్పెండ్ చేయడం ఏమిటి?

సారంగాపూర్: ఎలాంటి విచారణ జపరకుండానే ఏకపక్షంగా పోలీస్ అధికారిని సస్పెండ్ చేయడం విడ్డూరంగా ఉందని మాజీ జెడ్పీటిసి ముక్క శంకర్, యువజన సంఘం నాయకుడు చుక్క అంజన్న అన్నారు. శుక్రవారం బీర్‌పూర్,సారంగాపూర్ మండల కేంద్రాల్లో వారు వేర్వేరుగా మాట్లాడారు. విచారణ జరపకుండా ఎస్సై అనిల్‌ని సస్పెండ్ చేయడం సరికాదన్నారు. బస్సు డ్రైవర్, కండక్టర్, ప్రయాణికులను విచారణ జరిపి ఎస్సై మీద చర్యలు తీసుకుంటే బాగుండేదన్నారు. ఒక వర్గం మెప్పు కోసం ఎస్సై కుటుంబం మీద కక్షపూరిత చర్యలు తీసుకోవడంపై అధికారులు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు.

వైకుంఠ రథం బహూకరణ

ధర్మపురి: మండలంలోని జైనా గ్రామానికి చెందిన గుడ్ల విజయ్‌కుమార్ తన తండ్రి గుడ్ల సత్యనారాయణ, సోదరుడు గుడ్ల శ్రీకాంత్ జ్ఞాపకార్థంగా జైనా, కోస్నూర్‌పల్లె గ్రామస్తుల కోసం సుమారు రూ.3 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని శుక్రవారం కోస్నూర్‌పల్లెలో సర్పంచ్ ఎన్నం లక్ష్మారెడ్డి సమక్షంలో పంచాయతీకి అందజేశాడు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌ను కల్కియూత్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

నూతన నియామకం

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన కంఠం దేవన్న మండల కార్యదర్శిగా, ఫకీర్ కొండాపూర్ గ్రామానికి చెందిన ఏళ్ల శ్రీనివాస్‌ను కిసాన్‌మోర్చా మండల ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు బట్టు జకరయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి సుంచు రణదీర్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, మహేశ్, మహేందర్ పాల్గొన్నారు.

15 నుంచి 17 వరకు సీఎంకప్ ఆటల పోటీలు

పెగడపల్లి:మండల కేంద్రంలో ఈ నెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో సీఎం కప్ ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ శోభ, ఎంపీడీవో పుల్లయ్య శుక్రవారం తెలిపారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు జరుగుతాయని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వ్యాయామ ఉపాధ్యాయులు రమేశ్ 94911 09138, శివకృష్ణ 85000 91306, మహేశ్, 95532 77406, సంధ్య 96768 49149, రాజ్‌కుమార్ 73370 96642 నంబర్లలో సంప్రదించాలని ఎంపీడీవో పేర్కొన్నారు.

పారిశుధ్య పనుల నిర్వహణపై పట్టింపు లేదా?

మల్లాపూర్: గ్రామాల్లో పారిశుధ్య పనులపై అధికారులకు పట్టింపు లేదా అని ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం మండలంలోని రేగుంటలో పలు కాలనీల్లో నిలిచిన చెత్త చెదారాన్ని గ్రామస్తులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. గ్రామపంచాయతీ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, కార్మికుల నిరవధిక సమ్మెతో గ్రామాల్లో పరిపాలన స్తంభించిందన్నారు. జేపీఎస్‌లు, జీపీ కార్మికులు సమ్మెకు వెళ్లినా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో నిమ్మల జలంధర్, నల్ల రాజేశం, బండారి వెంకటేష్, నేరేళ్ల రాజరెడ్డి, ఇట్టిడి జితేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘం సలహా కమిటీ ఎంపిక

కోరుట్ల: చేనేత పారిశ్రామిక సంఘం సలహా కమిటీని నియమిస్తూ హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ డిపార్ట్‌మెంట్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కోరుట్ల చేనేత సహకార సంఘం సలహాకమిటీ సభ్యులుగా వాసం భూమానందం, గోనె శంకర్, గజెల్లి లక్ష్మయ్య, ద్యావనపల్లి గంగాధర్, రుద్ర సుధాకర్‌ను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సలహా కమిటీ ప్రతినిధి వాసం భూమానందం మాట్లాడుతూ చేనేత సహకార సంఘం అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. సంఘం అభివృద్ధికి సహకారం అందించిన ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

'ఏబీవీపీ నాయకురాలిపై పోలీసుల తీరు సరికాదు'

కోరుట్ల: నిబంధనలను తుంగలో తొక్కుతున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిన ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని పోలీసులు తీవ్రంగా కొట్టడం సరికాదని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాడవేని సునీల్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసులు అరాచకాలను ప్రోత్సహిస్తూ ప్రశ్నించేవారిపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఝాన్సీని పోలీసు అధికారులు తీవ్రంగా కొట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఏసీపీ, సీఐలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోన్ ఇన్‌చార్జి పవన్, సంజీవ్, మణిదీప్, పవన్, నవదీప్, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ పట్టణ బంద్‌కు సహకరించాలి

రాయికల్: ఆర్టీసీ బస్సులో జరిగిన ఓ సంఘటన కారణంగా ఎస్సైని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం రాయికల్ పట్టణంలో విశ్వహిందు పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని సంఘం సభ్యులు శుక్రవారం పిలుపునిచ్చారు. వర్తక వ్యాపారస్తులు, ప్రజలు సహకరించాలని కోరారు.

కార్యదర్శుల సమ్మెకు కాంగ్రెస్ మద్దతు



సంఘీభావం తెలుపుతున్న విజయలక్ష్మి

జగిత్యాలరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మహిళ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు ఆమె సంఘీభావం తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమురయ్య మాట్లాడుతూ న్యాయపరమైన డిమాండ్లను ఆమోదించే వరకూ సమ్మె విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ కార్యదర్శులు సంతోష్, రవళి, వంశీధర్, రాజిరెడ్డి, రాజు, మల్లిఖార్జున్, నజీమ్, అక్బర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాయికల్: మండలంలోని అల్లీపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణం కమనీయంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకురాలు బోగ శ్రావణి, శైలేందర్‌రెడ్డి, సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, ఎంపీటీసీ మోర విజయలక్ష్మి, నాయకులు సురేశ్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి క్షీరాభిషేకం

ధర్మపురి: శ్రీ లక్ష్మీ నరసింహస్వామి అనుబంద ఆలయమైన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. రకరకాల పూలతో స్వామివారిని అలంకరించి ఆలయ అర్చకులు శ్రీనివాసచార్యులు మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణంలో లక్ష్మీహవన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

హనుమాన్ భక్తుల శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

పెగడపల్లి: మండలంలోని రాజరాంపల్లిలో శుక్రవారం హనుమాన్ భక్తులు శోభాయాత్ర చేపట్టారు. గ్రామంలోని పలు వీధుల మీదుగా నిర్వహించిన శోభాయాత్రలో స్థానికులతో పాటు దీక్షాపరులు జై బోలో హనుమాన్‌కి నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి రాజశేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు రవి, కిరణ్, రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

'ఎస్సై అనిల్ సస్పెన్షన్ అప్రజాస్వామికం'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కోరుట్ల: జగిత్యాల ఎస్సై అనిల్ సస్పెన్షన్ అప్రజాస్వామికమని కోరుట్ల సెగ్మెంట్ బీజేపీ నాయకులు ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు సురభి నవీన్ కుమార్, సుఖేందర్, జంగిలి సునీత మాట్లాడుతూ ఒక వర్గానికి కొమ్ముకాయడానికే ఎస్సైపై చర్యలు తీసుకున్నారన్నారు. ఎలాంటి విచారణ లేకుండా ఎవరి మెప్పు కోసం ఎస్సైపై చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ తీరు రజాకార్లను తలపిస్తుందని, పసిబిడ్డకు పాలివ్వడానికి బస్సులో చోటు అడిగిన తల్లిని అకారణంగా దూషించి ఆమె భర్తపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎస్సై అనిల్‌కుమార్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేని పక్షంలో జిల్లా బంద్ చేస్తామన్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీరు చూస్తే స్టీరింగ్ ఎంఐఎం పార్టీ చేతిలో ఉందని అందరికీ తెలిసిపోయిందన్నారు. సమావేశంలో కౌన్సిలర్ మాడవేని నరేశ్, బీజేపీ మాజీ పట్టణాధ్యక్షుడు దాసరి రాజశేఖర్, జిల్లా కార్యవర్గసభ్యులు సుదవేని మహేశ్, పోతుగంటి శ్రీనివాస్, మొలుమూరి మురళి, మామిడి విజయ్, నాగరాజు పాల్గొన్నారు.

'ధాన్యం అధిక తూకాన్ని అరికట్టాలి'

జగిత్యాలరూరల్: ధాన్యం సేకరణలో ట్రక్‌షీట్ పేరుతో అధిక తూకం వేయిస్తున్నారని, ఆ దోపిడీని అరికట్టాలని శుక్రవారం జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషాకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. రాష్ట్రంలో ఒక వైపు ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, వడగళ్ల వానలతో పంటలు దెబ్బతిని రైతులు ఆందోళనలో ఉన్నారని, ఈ నేపథ్యంలో ధాన్యం సేకరణ ఏలాంటి ఆంక్షలు లేకుండా చూడాలన్నారు. పూర్తిస్థాయిలో రైతులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వ్యవసాయాధికారుల పరిశీలన అనంతరమే తూకం వేసినా రైస్‌మిల్లర్లకు తరలించకుండా రైస్‌మిల్ పాయింట్లలో అన్‌లోడ్ చేయడంలో జాప్యం జరుగుతుండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,రైతుల నుంచి సుమారు క్వింటాలుకు ఐదు కిలోలు అదనపు తూకం వేయిస్తున్నారని, అలా వేయకుండా రైస్‌మిల్లర్లు ధాన్యం తూకం నిరాకరిస్తుండటం దురదృష్టకరమన్నారు. వెంటనే అదనపు తూకంపై చర్యలు చేపట్టాలని కోరారు.